క్లుప్తంగా

నేడు మేకపాటి విజయీభవ యాత్ర

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి విజయీభవ యాత్ర సోమవారం మండలంలోని అప్పారావుపాళెం, నువ్వూరుపాడు, నల్లపరెడ్డిపల్లి గ్రామాల్లో జరుగుతుందని ఆత్మకూరు జెడ్పీటీసీ పెమ్మసాని ప్రసన్నలక్ష్మీ ఆదివారం తెలిపారు. ఆయా గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు నిర్మాణాలు పూర్తయిన ప్రారంభోత్సవాలు నిర్వహిస్తామన్నారు. మండలంలోని అన్ని గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, హాజరుకావాలని కోరారు.

ఆక్రమణలోని పాఠశాల స్వాధీనం

సంగం: సంగం పంచాయతీ మజారా ఏఎస్‌కండ్రికలో ఆక్రమణకు గురైన పాఠశాల భవనాన్ని ఎంఈఓ జానకీరాం ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో నిర్మించిన పాఠశాలలో విద్యార్థులు ఎవరూ లేకపోవడంతో గత 20 ఏళ్లుగా మూతపడి ఉంది. అదే గ్రామానికి చెందిన కొంత మంది ఆక్రమించుకున్నారని, గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత సుభాస్కర్‌రెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఫిర్యాదు మేరకు ఎంఈఓ జగన్నాథశర్మ ఆదివారం పాఠశాలలో ఉన్న వస్తువులన్నింటిని బయట పెట్టించి తాళం వేయించారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

నేడు మండల సమావేశం

చేజర్ల: మండల పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి జరుగుతుందని ఎంపీడీఓ ఎస్‌కే కరిముల్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ తూమాటి విజయభాస్కర్ రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశంలో పలు అంశాలు చర్చిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

వైఎస్సార్ విగ్రహం తొలగింపుపై కేసు నమోదు



వైఎస్సార్ విగ్రహం తొలగించిన దృశ్యం

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని బుక్కాపురం పంచాయతీ తొగటపల్లిలో ఏర్పాటు చేసిన దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని కుటుంబ విభేదాల నేపథ్యంలో ఆదివారం సిద్దంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తొలగించడంపై ఆయనపై కేసు నమోదు చేశారు. ఎస్సై సీహెచ్ కోటిరెడ్డి సమాచారం మేరకు 2014లో గ్రామస్తుల సహకారంతో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ఏర్పాటు చేశారు. అయితే ఎలాంటి అనుమతులు లేకుండా విగ్రహాన్ని తొలగించడంపై గ్రామస్తులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కేసు నమోదు చేసి విగ్రహాన్ని, ప్రొక్లెయిన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఘటనా స్థలాన్ని కలిగిరి సీఐ ఫిరోజ్ పరిశీలించారు.

ఉదయగిరి సెబ్ సీఐగా రమణమ్మ



బాధ్యతలు స్వీకరించిన రమణమ్మ

ఉదయగిరి: ఉదయగిరి సెబ్ సీఐగా ఆర్‌వీ రమణమ్మ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా పల్నాడు జిల్లా పొందుగుల చెక్‌పోస్టు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. గతేడాది నుంచి ఉదయగిరి సెబ్ సీఐ పోస్టు ఖాళీగా ఉంది. ప్రస్తుతం భర్తీ అయింది. ఉదయగిరి సెబ్ సర్కిల్ పరిధిలో మాదక ద్రవ్యాలు వాడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

దోమల మందు పిచికారీ



ఫాగింగ్ మెషిన్ ద్వారా మలాథియన్ పిచికారీ చేస్తున్న దృశ్యం

అల్లూరు: నగర పంచాయతీలో ముమ్మరంగా దోమల మందు పిచికారీని ఆదివారం నుంచి ప్రారంభించారు. ఫాగింగ్ మెషిన్ ద్వారా మలాథియన్ ద్రావణాన్ని వీధుల్లో పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ శానిటరీ మేస్త్రీ రమణయ్య పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

సంగం: సంగం నుంచి పామూరు వెళ్తున్న కారు హసనాపురం నుంచి కొరిమెర్ల వైపు వస్తున్న ద్విచక్ర వాహనచోదకుడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడు అక్బరాబాద్‌కు చెందిన ఖాజారసూల్‌గా గుర్తించారు. క్షతగాత్రుడిని 108 వాహనంలో వైద్యశాలకు తరలించారు.

ఆత్మసాక్షిగా వచ్చే ఎన్నికల్లో ఓటేయండి

- ఏ ప్రభుత్వం మీకు మేలు చేసిందో భేరీజు వేసుకోండి
- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- రూ.9.5 కోట్ల వ్యయంతో వెన్నవాడ–గండ్లవేడు రోడ్డు, బొగ్గేరుపై కాజ్‌వేకు శంకుస్థాపన



బహిరంగ సభలో మాట్లాడుతున్న మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: కరోనా వంటి విపత్తుతో రెండేళ్లు సంపద స్తంభించినా నాలుగున్నర ఏళ్లకు పైగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.3 లక్షల కోట్లకుపైగా సంక్షేమ పథకాల ద్వారా నేరుగా పేద ప్రజలకు అందించారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చెప్పారు. గత ప్రభుత్వంలో కులం, మతం పార్టీతో పాటు టీడీపీ నాయకుల ఇష్టానుసారం ప్రజలకు అందాల్సిన నిధులు పక్కదోవ పట్టించి అందులో కొంత స్వాహా చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో ఆత్మసాక్షితో ఆలోచించి ఓటేయ్యాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని పడకండ్ల పంచాయతీ గండ్లవేడులో రూ.9.5 కోట్ల వ్యయంతో బొగ్గేరుపై కాజ్‌వే నిర్మాణంతో పాటు రహదారి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే సోమవారం భూమి పూజ చేశారు. అనంతరం ఈ బృహత్తర కార్యక్రమానికి పైలాన్‌ను ఆవిష్కరించారు. పంచాయతీలోని పలు అభివృద్ధి పథకాలను ప్రారంభించి మాట్లాడారు. ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం ప్రతి కుటుంబాన్ని ఆదుకున్నారన్నారు. గతం టీడీపీ, ప్రస్తుత జగన్ ప్రభుత్వం చేసిన, చేస్తున్న పాలనను భేరీజు వేసుకుని రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి ఘన విజయం చేకూర్చాలని కోరారు. తాను చేసిన సంక్షేమ పథకాలను జగన్ తప్ప ఈ దేశంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయలేదని, ఈ కారణంగానే దేశ రాజకీయ చరిత్రలో తన ప్రభుత్వం వల్ల మేలు జరిగిందనుకుంటేనే మళ్లీ తమ పార్టీకి ఓట్లు వేయమని దేశ స్థాయిలోనే అడిగిన దమ్మున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఒక్కడేనన్నారు. బ్రిటిష్ పాలన తర్వాత జగన్ భూ రక్ష, భూ హక్కు పథకం ద్వారా భూముల రీ సర్వే అత్యాధునిక డిజిటల్ పద్ధతిలో చేస్తోన్న రాష్ట్రం భారతదేశంలో మన రాష్ట్రమేనన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో 70 వేల మంది రైతుల చుక్కల భూముల సమస్యలు, తదితర ఇబ్బందులను ఇటీవల పరిష్కరించామని, ఒక్క పడకండ్ల పంచాయతీలోనే 60 మంది రైతులకు చెందిన 372 ఎకరాల చుక్కల భూములు, 45 మందికి చెందిన 58 ఎకరాలు ఇనామ్ భూములు, 92 మందికి చెందిన సాదాబైనామా, 14 మంది రైతులకు చెందిన నోషనల్ ఖాతాలు ఇందులో ఉన్నాయన్నారు.

జేజేలు పలికిన గ్రామాల ప్రజలు

గండ్లవేడు–వెన్నవాడ మధ్య బొగ్గేరుపై కాజ్‌వే నిర్మాణంతో పాటు రామస్వామిపల్లి నుంచి డీసీపల్లి మీదుగా వింజమూరు మండలం నల్లగొండ్ల వరకు తారు, సిమెంటు రోడ్ల నిర్మాణాలకు గండ్లవేడులో నిర్వహించిన భూమి పూజ, పైలాన్ ఆవిష్కరణ కార్యక్రమాలకు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున జేజేలు పలికారు. గండ్లవేడుకు చెందిన కొల్లి దొరస్వామినాయుడు, దాడి శ్రీనివాసులునాయుడు, ఎం.రోశయ్యనాయుడు, కొల్లి శ్రీహరి నాయుడు తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆద్యంతం జనసందోహం జయజయ ధ్వానాల మధ్య జరిగింది. ఆయా గ్రామాల ప్రజలు గజమాలలతో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షత వహించగా, జెడ్పీటీసీ పెమ్మసాని ప్రసన్న లక్ష్మీ, ఆత్మకూరు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చిట్టమూరు జితేంద్రనాగ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు జగన్నాథం ఆదిలక్ష్మమ్మ, బొలిగర్ల వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షులు సానా వేణుగోపాల్ రెడ్డి, బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి, సోమల మాధవ రెడ్డి, మాజీ అధ్యక్షుడు పర్వతరెడ్డి బలరామిరెడ్డి, మర్రిపాడు, ఆత్మకూరు మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు గంగవరపు శ్రీనివాసులునాయుడు, రేవూరు వేణుగోపాల్ రెడ్డి, ఇందూరు వెంకటరమణారెడ్డి, యర్రంరెడ్డి నాగమోహన్ రెడ్డి, దశించర్ల ప్రసాద్, జగన్నాథం ప్రసాద్, గడ్డం శ్రీనివాసులు రెడ్డి, ఒంటెద్దు కృష్ణారెడ్డి, పడకండ్ల శ్రీనివాసులు రెడ్డి, కొల్లి హజరత్తయ్య నాయుడు, పెమ్మసాని శ్రీనివాసులు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



బొగ్గేరుపై కాజ్‌వే నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మేకపాటి విక్రమ్‌రెడ్డి, నాయకులు



గండ్లవేడులో రామస్వామిపల్లి–నల్లగొండ్ల రోడ్డు నిర్మాణానికి పైలాన్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

కలిగిరి: కలిగిరి బిట్–2 సచివాలయం పరిధిలో సోమవారం గడపగడపకు మన కార్యక్రమం జరుగుతుందని జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

విజేతలకు బహుమతి ప్రదానం



బహుమతి అందజేస్తున్న జెడ్పీటీసీ రామాంజనేయులు

ఉదయగిరి: మండలంలోని గుడినరవలో మూడురోజులపాటు జరిగిన క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో విజేత జట్టుగా నిలిచిన దాసరపల్లి క్రీడాకారులకు రూ.40 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ టోర్నమెంట్ నిర్వహణకు ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మోది రామాంజనేయులు, మాజీ మండల ఉపాధ్యక్షుడు బాలిబోయిన శ్రీనివాసులు, స్థానిక సర్పంచ్ బి.వెంకటేశ్వర్లు, అంబటి సుబ్బారెడ్డి, తదితరులున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

- సంక్రాంతి మండల క్రికెట్ విజేత తిమ్మాయపాళెం



కప్‌తో విజేత తిమ్మాయపాళెం క్రికెట్ జట్టు

చేజర్ల: క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఎంజీఆర్, గొల్లపల్లి ప్రీమియర్ లీగ్ ఆధ్వర్యంలో ఆదివారంతో మండల స్థాయి క్రికెట్ పోటీలు గొల్లపల్లి క్రీడా మైదానంలో ముగిశాయి. మండల విజేతగా తిమ్మాయపాళెం జట్టు, రన్నరప్‌గా గొల్లపల్లి జట్టు గెలుచుకొంది. ప్రథమ బహుమతి కింద రూ.15 వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.7 వేలు ఆర్గనైజర్లు అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతినిత్యం సాయంత్రం వేళల్లో క్రీడలు ఆడాలన్నారు. క్రీడలతో ఎల్లప్పుడు ఆరోగ్య వంతులు ఉంటారన్నారు. క్రికెట్ కాకుండా వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్‌పై కూడా యువత ఆసక్తి చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ప్రభాకర్, క్రికెట్ ఆర్గనైజర్‌లు బొరిగెర్ల వినోద్, బొరిగెర్ల రామచంద్రయ్య, జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం కార్యదర్శి షేక్ మహమ్మద్ రఫి పాల్గొన్నారు.

రామాలయాల్లో విశేష పూజలకు ఏర్పాట్లు



పంటవీధి రామాలయంలో శుభ్రం చేస్తున్న దృశ్యం



దేవస్థాన ప్రాంగణంలో శుభ్రపరుస్తున్న దృశ్యం

- భారీ స్థాయిలో అన్నదానాలు

ఆత్మకూరు: అయోధ్యలో నిర్మించిన భవ్య రామమందిరం సోమవారం ప్రారంభం కానున్న తరుణంలో పట్టణంలోని పలు రామమందిరాల్లో ప్రత్యేక పూజలు భజనలు, భారీ స్థాయిలో అన్నదానాలు నిర్వహించనున్నారు. ఆలయాలను పరిశుభ్రం చేసి, మామిడి తోరణాలు అలకరిస్తున్నారు. ఉదయం రామాలయాల్లో మూలవిరాట్‌లకు విశేష ద్రవ్యాలతో అభిషేకాలు, అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయాల నిర్వాహకులు తెలిపారు. విశ్వహిందూ పరిషత్ ఏబీవీపీ, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పట్టణంలోని ముఖ్య కూడళ్లలో హనుమాన్ జెండాలను ఏర్పాటు చేశారు. ఆలయాల్లో సీతారామ లక్ష్మణుల ఉత్సవమూర్తులను ముందస్తుగానే సుందరంగా అలంకరించారు. ఆలయాల్లో పూజల అనంతరం నైవేద్యాలు సమర్పించి ప్రసాదాలు భక్తులకు అందజేయనున్నారు. ఆర్యవైశ్య యువజన సంఘం, లయన్స్ క్లబ్ సహకారంతో మున్సిపల్ బస్టాండ్ వద్ద, సోమశిల రోడ్డు సెంటర్ వద్ద భారీ స్థాయిలో అన్నదానాలు నిర్వహించనున్నట్లు యూత్ సంఘం నాయకులు తెలిపారు.

రామాలయం పరిశుభ్రం

ఉదయగిరి: మండలంలోని గన్నేపల్లి అడవి పేరంటాలమ్మ దేవస్థానంలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో దేవాలయ పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. సోమవారం అయోధ్యలోని జరగబోవు రామమందిర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వీక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గ బీజేపీ కన్వీనరు కదిరి వెంకటరంగారావు, స్థానిక నేతలు వెంకటస్వామినాయుడు, ఆవుల రోశయ్య, మేకపాటి మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత జట్టుకు నగదు బహుమతి

దుత్తలూరు: మండలంలోని భైరవరంలో ఆదివారం జరిగిన మండల స్థాయి క్రికెట్ పోటీల్లో విజేత జట్టుకు చేజర్ల సుబ్బారెడ్డి చారిటబుల్ తరఫున రూ.30 వేలు నగదు బహుమతి అందించారు. ట్రస్ట్ ప్రతినిధి చేజర్ల సుబ్బారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువకుల్లో క్రీడలపై ఆసక్తి పెంచే ఉద్దేశంతో మండల స్థాయిలో వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గువ్వల శేఖర్‌రెడ్డి, పోలు పుల్లారెడ్డి, చేజర్ల సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు నగదు బహుమతి అందజేస్తున్న సుబ్బారెడ్డి

కొనసాగుతున్న కులగణన సర్వే



వావిలేరులో కులగణన సర్వే చేస్తున్న సిబ్బంది



కలిగిరిలో..

చేజర్ల: ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో ఆదివారం కులగణన సర్వే కొనసాగుతోంది. ఈ సర్వేలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొంటున్నారు. ఈ సర్వే సులభంగా అర్థమయ్యే అంశాలతో యాప్ రూపొందించినట్లు అధికారులు తెలిపారు. సర్వేలో సమాచారం మాత్రమే సిబ్బందికి తెలపాలన్నారు.

కలిగిరి: మండలంలోని 14 సచివాలయాల పరిధిలో సచివాలయాల సిబ్బంది, గ్రామ వలంటీర్లు కులగణన సర్వే కార్యక్రమాన్ని ముమ్మరం చేస్తున్నారు. ఎంపీడీఓ జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆదివారానికి మండలంలో 33 శాతం సర్వే పూర్తయిందన్నారు. గ్రామాల్లో ఇళ్ల వద్దకు వచ్చే సిబ్బంది, వలంటీర్లకు ప్రజలు సహకారం అందించాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యేకు ఘనస్వాగతం



ఎమ్మెల్యే మేకపాటితో వైఎస్సార్‌సీపీ నాయకులు

సంగం: ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదివారం విజయీభవ యాత్రకు బయలుదేరిన సందర్భంగా సంగం చెక్‌పోస్టు సెంటర్ సమీపంలో ఉన్న మాతా పరమేశ్వరి ఆలయం వద్ద పార్టీ స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. ముందుగా ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న విక్రమ్‌రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలోని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పులగం శంకర్ రెడ్డి, మాజీ కన్వీనర్ కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డి, నాయకులు కర్నాటి రవీంద్రరెడ్డి, సంగమేశ్వరాలయ చైర్మన్ రవీంద్రబాబు, నేతలు జనార్ధన్‌రెడ్డి, జహంగీర్, శివ తదితరులు పాల్గొన్నారు.

రేపు జగనన్న ఆరోగ్యసురక్ష

జలదంకి: మండలంలోని జలదంకి–2 సచివాలయ పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బత్తిన సింగయ్య ఆదివారం తెలిపారు. ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రత్యేక వైద్య నిపుణులు పాల్గొంటారని తెలిపారు. రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తారన్నారు. జలదంకి–2 సచివాలయ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా చెంచయ్య

పొదలకూరు : జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా పొదలకూరుకు చెందిన అమర్తలూరు చెంచయ్యను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ముత్తుకూరు మండలానికి చెందిన చెందా వెంకటస్వామి, కోశాధికారిగా బుచ్చిరెడ్డిపాళెం మండలానికి చెందిన టి.ఆదినారాయణ, అదనపు కార్యదర్శిగా పొదలకూరు పట్టణానికి చెందిన పొట్టి సుధాకర్‌ను నియమించినట్లు వారు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సూరా శ్రీనివాసులురెడ్డిపై సస్పెన్షన్ వేటు

కోవూరు : వవ్వేరు బ్యాంక్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నేత సూరా శ్రీనివాసులురెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు బుచ్చిరెడ్డిపాళెం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నాడన్న కారణంతో సూరా శ్రీనివాసులురెడ్డిని సస్పెండ్ చేసినట్లు ఆయన వెల్లడించారు.

వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): అనారోగ్యంతో ఓ వ్యక్తి తన ఇంట్లో మృతి చెందారు. మృతదేహం కుళ్లి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండటంతో మృతుడి బంధువులు, పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. పోలీసుల సమాచారం మేరకు.. మూలాపేటలోని బెస్తవారిపాళేనికి చెందిన సురేష్‌రెడ్డి (55) అవివాహితుడు. ఎలక్ట్రీషియన్ పనులు, జ్యోతిష్యం చెప్తూ ఒంటరిగా ఉంటున్నారు. ఇంటి నుంచి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండటంతో స్థానికులు మూలాపేటలో నివాసం ఉంటున్న అతని సోదరుడి కుమారుడు అయ్యప్పరెడ్డి, చిన్నబజార్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని ఇంటి తలుపులను పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా, సురేష్‌రెడ్డి మృతి చెంది ఉన్నారు. సురేష్‌రెడ్డి మృతి చెంది మూడు, నాలుగు రోజులై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. అయ్యప్పరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని చిన్నబజార్ ఎస్సై సైదులు తెలిపారు. అనారోగ్యమే మృతికి కారణమని తెలిపారు.

సంక్షేమ సారథి సీఎం జగన్



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

- సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మేకపాటి రాజారెడ్డి

ఉదయగిరి: రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని కృష్ణంపల్లిలో ఆదివారం సచివాలయ, రైతుభరోసా, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ సెంటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రస్తుతం అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే టీడీపీ, ఎల్లో మీడియా చేసే దుష్ప్రచారాన్ని నమ్మకుండా వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తెచ్చుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ డబ్బులు పెట్టి ఓట్లు కొని అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆలోచించి రాష్ట్ర భవిష్యత్‌కు ఎవరు పాటు పడుతున్నారో వారికి మద్దతివ్వాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ మధ్య పాలనలో ఉన్న తేడా గమనించి మంచి నిర్ణయం తీసుకోవాలన్నారు. పవన్‌కల్యాణ్ రాజకీయ అవగాహన లేకుండా అభివృద్ధి గురించి మాట్లాడుతున్నారని, ఇలాంటి వ్యక్తి రాజకీయాలకే పనికిరాడని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతున్నా పచ్చగ్యాంగ్, ఎల్లో మీడియా చిన్న సమస్యను కొండంత సమస్యగా ప్రచారం చేయడం దుర్మార్గమైన చర్యన్నారు. ప్రతి పక్షాలు చేసే కుట్ర, కుతంత్రాలను తిప్పికొట్టి నెల్లూరు పార్లమెంట్, ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల్ని గెలిపించాలని కోరారు. అంతకు ముందు రాజగోపాల్‌రెడ్డికి స్థానికులు పూలు వెదజల్లుతూ తాళాలు, తప్పెట్లతో అపురూప స్వాగతం పలికారు. అనంతరం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరించే బుక్‌లెట్‌లు రాజారెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు మోది రామాంజనేయులు, గణపం బాలకృష్ణారెడ్డి, పావులూరి మాల్యాద్రిరెడ్డి, కృష్ణంపల్లి, ఆర్లపడియ సర్పంచ్‌లు అక్కి ప్రమీల, ముటుకుందు లక్ష్మీనారాయణమ్మ, జిల్లా కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జి.ఓబుల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కి భాస్కర్‌రెడ్డి, ముటుకుందు తిరుపతిరెడ్డి, మూలె వెంకటసుబ్బారెడ్డి, అల్లూరురాజు, సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, కె.భాస్కర్ రెడ్డి, కె.వీరారెడ్డి, కె.ఓబుల్‌రెడ్డి, ఆవుల రత్తయ్య, వీరశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఘాట్‌రోడ్డు పనుల పరిశీలన



ఘాట్‌రోడ్డు పనులు పరిశీలిస్తున్న రాజారెడ్డి

ఉదయగిరి: ఉదయగిరి–బండగానిపల్లి వెళ్లే ఘాట్ రోడ్డు పనులను ఆదివారం ఉదయగిరి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పరిశీలించారు. పనుల్లో పురోగతిపై ఆరా తీశారు. గతంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బండగానిపల్లికి వచ్చిన మేకపాటి త్వరలో ఘాట్‌రోడ్డు పనులు చేయిస్తామని హామీ ఇచ్చారు. అందులో భాగంగా రెండు రోజుల క్రితం ఈ రోడ్డు పనులు ప్రారంభించారు. అతి త్వరలో పనులు పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ ప్రాంత వాసులు ఈ రోడ్డు మార్గం సక్రమంగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రోడ్డు పనులు జరుగుతుండటంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులు చేయిస్తున్న రాజారెడ్డికి కొండకింద గ్రామాల ప్రజలు ధన్యవాదాలు తెలుపుతున్నారు.

తాళ్లూరు దాతృత్వంతో వాటర్ ప్లాంట్



మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ ప్రసాద్‌నాయుడు, ఆయన, సోదరుడి కుమార్తెలు

కావలి: దగదర్తి మండలం మబ్బుగుంటపాళెం ప్రజల తాగునీటి కష్టాలను తీర్చేందుకు ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు చొరవ తీసుకున్నారు. గ్రామంలో జవ్వనీటితో తాగునీటికి పడుతున్న ఇబ్బందులను స్థానికులు ఎంపీపీ దృష్టికి తీసుకురావడంతో తన తల్లి తాళ్లూరు సుజాతమ్మ జ్ఞాపకార్థంగా గ్రామస్తులకు తాగునీటి వసతిని కల్పించాలని సంకల్పించారు. రూ.4 లక్షలు వెచ్చించి గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు కుమార్తె లక్ష్మీశివాని, ఆయన సోదరుడు తాళ్లూరు రవిప్రసాద్‌నాయుడు కుమార్తె ఆషిత ఆదివారం మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి గ్రామస్తులకు అంకితమిచ్చారు. దీంతో అడిగిన వెంటనే తమ దశాబ్దాల కోరికను తీర్చిన తాళ్లూరు ప్రసాద్ నాయుడు కుటుంబ సభ్యులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.